భర్త మౌనంగా వుండడంతో, ఆదిలక్ష్మికి భయం పెరిగింది. ఆతృత యింకా ఎక్కువైంది. మళ్ళీ ప్రశ్నించబోయింది. ఇంతలో భద్రయ్యే –

"...నాయుడు గారి బామ్మర్దే మున్సిపల్ ఛైర్మేన్. ఆయన్ని వోపాలి కలాల!" అన్నాడు.

"...ఇంకెపుడు కలుస్తావ్? బడ్డీ కొట్టుని అక్కడ్నించి తీసేసినారు కాదేటి? ఆలీసమైతే, ఆ బడ్డీని ఎందల తోసేత్తారో ఆళ్లు..." అంది ఆదిలక్ష్మి.

"...ఇపుడింక మీటింగయింది. ఆ బాబు ఇంటికెల్తండు. కసింత అన్నం బెట్టు తినీసెల్తాను" అన్నాడు భద్రయ్య.

"...వొక పన్జెయ్య గూడదూ? ఈ బాబుని కలసీ బదులు, మనూరెల్లి నాయుడిగారినే కలిస్తేనో? అతగానయితే మనకీ చనువుంది. ఆ ఏరియా మనుషులం గనక అతగానికి ఆ యింత అప్మానమేనా వుంటాది" అని సలహా యిచ్చింది.

భద్రయ్యకు ఆదిలక్ష్మి సలహా నచ్చింది, చిక్కుల మధ్య సతమతమయ్యే భద్రయ్యకి ... చిన్నగా ఆశ కన్పించింది ... నాయుడిగారి మీద.

భోజనం జేస్సి, బయల్దేరాడు జాతర్లపల్లి.

* * *

జాతర్లపల్లి జంక్షనులో బస్సుదిగి, ఊర్లోకి నడుస్తుంటే భద్రయ్యకు ... గతమంతా కదలాడింది. చిన్ననాడు ఈదులాడిన వంశధార నది గల గలలు, గుండెల్లో ఊసులాడసాగేయి. కూతవేటు దూరాన్నించి విన్పించే బంగాళాఖాతం సముద్రహోరు చెవులకి సోకుతోంది. కాలిబాట ... పురాతన మిత్రుడిలా ఊరిలోకి దారి చూపుతూ తీసుకు పోయింది భద్రయ్యను.

నాయుడుబాబు ... పెద్దింటి ముందుగదిలో పందిరకోళ్ళ మంచమ్మీద చేరబడి వున్నారు. ఎదురుగా ఎవరో కుర్రాడు ... ఖరీదైన డ్రెస్సులో, దర్జాగా రాజ్యాన్ని కొనేయగలిగిన కంపెనీ వోనర్లా వున్నాడు. నాయుడు బాబుకి ఏవో లెక్కలు చెప్తున్నాడు. భద్రయ్య దండాలు పెట్టాడు ... ద్వారం దగ్గరే నిల్చొని. నాయుడుగారు, ప్రశ్నార్థకంగా చూస్తుంటే

"నీను బాబూ, భద్రయ్యని..." అన్నాడు భద్రయ్య.

నాయుడుగారి కళ్ళు ... క్లోజప్‌లో కొచ్చాయి. భద్రయ్య ద్వారం దాటి గదిలోకొచ్చి, చేతులు జోడించి –

"అప్పుడు, నా తండ్రి తమ ట్రాక్టరు కిందపడి, నడుము జారిపోయి, ఆస్పత్రిపాలయితే, ఆడి వొయిద్యంకి, పట్నంకి కాపురం మార్సినపుడు తమరే దారి సూపినారు నాకు. తమరి బామ్మర్దిగార్ని సూపించేరు" అని చెప్పుకొస్తున్నాడు.

నాయుడుగారు, ఔనన్నట్లు తలూపుతూ –

"...ఆ తర్వాత నువ్వు పెళ్ళీ పెటాకులూ జేసుకున్నావటా? వాచ్‌మేన్ పనిమానేసి

